మాయమవుతున్న కల్వర్టులు

- రహదారుల వెడల్పు, ప్రైవేట్ భవనాలకు అడ్డొస్తున్నాయంటూ తొలగిస్తున్న వైనం
- వర్షాలు, వరదలప్పుడు ప్రమాదమంటున్న నిపుణులు



బడంగ్‌పేట ప్రధాన రోడ్డు వెడల్పులో భాగంగా కల్వర్టులను తొలగించిన దృశ్యం

బడంగ్‌పేట్: వరదలు వచ్చినప్పుడు ప్రాణనష్టం, ఆస్తినష్టం, జంతునష్టం, పంటనష్టం జరగకుండా, ప్రమాదాలు రాకుండా నాటి ఇంజనీర్లు దిగువన ఉన్న ప్రాంతాలను రక్షించేందుకు, రాకపోకలు సాగించేందుకు కల్వర్టులను నిర్మించారు. రాను రాను వ్యవసాయ పొలాలు కాస్తా ప్లాట్లుగా మార్పులు చెందగా కాలనీలు ఏర్పడి చిన్న ప్రాంతాలు నేడు వ్యాపార వాణిజ్య సముదాయాలుగా మారాయి. అందరిని కాపాడిన కల్వర్టులు నేడు కనుమరుగవుతున్నాయి. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన రహదారిలో కొనసాగుతున్న కెనరా బ్యాంక్ ఎదుట, కనకదుర్గా వైన్స్ ముందు, పాల్‌టెక్నిక్ కాలేజీ ఎదుట, లిబ్రా కాలనీవద్ద, భారత్ పెట్రోల్ బంక్ వద్ద అలాగే రాఘవేంద్ర టీఫిన్ సెంటర్ వద్ద ముంపు ఉన్న ప్రాంతాలను గుర్తించి నాడు కల్వర్టులు నిర్మించారు. జనాభా పెరగడం వల్ల వాహనాల రద్దీ పెరిగి ప్రధాన రోడ్లు చిన్నవిగా తయారయ్యాయి. ప్రభుత్వం రోడ్ల వెడల్పునకు కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా, కార్పొరేషన్ అధికారులు పనులను చురుకుగా కొనసాగిస్తున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రోడ్లు వెడల్పు చేస్తున్నందుకు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కానీ, గతంలో ఉన్న కల్వర్టులను రోడ్డు వెడల్పులో భాగంగా దూరం జరిపి తిరిగి అదే ప్రాంతంలో నిర్మించకుండా మొత్తంగానే తొలగిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కల్వర్టులు లేకపోతే భవిష్యత్తులో భారీ వరదలు వస్తే వరదనీరు ఎక్కడికి పోవాలో తెలియక ఇళ్లను, కాలనీలను ముంచెత్తే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. 2021, 22లో భారీ వరదలు వచ్చి శివనారాయణపురం, కాశీబుగ్గ టెంపుల్, నవయుగ, సాయి నగర్, సాయిప్రభుహోమ్స్, ఇలా 30కి పైగా కాలనీలు మునిగి అపార నష్టం జరిగింది. నెలల పాటు నీళ్లల్లోనే జీవించారు. ఆ సంఘటనలను ఇంకా మర్చిపోలేదని స్థానికులు అంటుండగా, రోడ్లపై బడా వ్యాపార వాణిజ్య భవనాలను దృష్టిలో పెట్టుకుని కల్వర్టులు మాయం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పునరాలోచన చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కల్వర్టులు లేకపోతే ఎప్పటికైనా ప్రమాదమే



నాడు ముందు ఆలోచనతోనే కల్వర్టులు నిర్మించారు. వాటి వల్ల వరద నీరు వచ్చినప్పుడు పంటపొలాలు నాశనం కాకుండా ఆ గూనాలనుంచి నీళ్లు వెళ్లేవి. రైతులు సేఫ్‌గా ఉండేవారు. కాలనీలు ఏర్పడ్డాయి, భారీ వరదలకు బడంగ్‌పేటలోని చాలా కాలనీలు మునిగిపోయిన విషయం ఇంకా మరిచిపోలేదు. ఉన్న కల్వర్టులు తొలగిస్తే బడంగ్‌పేట భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని అధికారులకు ఫిర్యాదు చేశాను, తీస్తే అన్ని కల్వర్టులు తీసేయాలి. లేదా అన్ని కల్వర్టులు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నాము.

–పెద్దబావి భుజంగారెడ్డి, బడంగ్‌పేట

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: రోడ్డు విస్తరణలో భాగంగా గురువారం 11 కేవీ జనార్దన్‌రెడ్డి ఫీడర్ పరిధిలోని కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేంకటేశ్వర స్వామి దేవాలయం , జిల్లెలగూడ విలేజ్, వెంకటసాయి కాలనీ, విజయ దుర్గా కాలనీ, బండిసత్తయ్య కాలనీ, బృందావన్ కన్వెన్షన్ హాల్, వివేక్‌నగర్ కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించండి



మంత్రిని కలిసిన బైరాగిగూడవాసులు

కందుకూరు: మండల పరిధిలోని బైరాగిగూడకు చెందిన వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు బుధవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ సమీర్, మైనార్టీ బ్లాక్ ప్రెసిడెంట్ దావూద్, నాయకులు కుమార్, సర్వర్, వార్డు సభ్యులు నరేందర్, పరమేశ్వరి, భగవంత్, మైసయ్య, రాము, శివప్రసాద్‌గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తికి బీజేపీ తూట్లు



మహేశ్వరం: సంస్మరణ సభలో పాల్గొన్న రవికుమార్, నాయకులు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్

మహేశ్వరం: మేడే స్ఫూర్తికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో మేడే సందర్భంగా అమరవీరులను స్మరిస్తూ సంస్మరణ సభను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా పని చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. నరేంద్రమోడీ గత తొమ్మిదేళ్ల పాలనలో స్వదేశీ, విదేశీ పారిశ్రామిక ఆర్థికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారన్నారు. 8 గంటల పని దినాలను 12 గంటలకు పొడిగించేందుకు, పని భారం పెంచేందుకు శ్రీకారం చుట్టారన్నారు. కార్మిక సంక్షేమం, సాంఘిక భద్రత, ఉద్యోగ రక్షణ లేకుండా పోతుందన్నారు. మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం పోరాటాలు చేసి తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా శ్రామిక మహిళ కన్వీనర్ జి.కవిత, జిల్లా కమిటీ సభ్యులు శేఖర్ పలువురు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై ఆంక్షలు సరికాదు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల వద్ద వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలపై ఆంక్షలు విధించిందని ఆరోపించారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా కూలీలు పనిచేయాలని రెండుసార్లు ఫోటోలు తీసి ఫార్వర్డ్ చేయమని హుకుం జారీచేయడం విడ్డూరంగా ఉందన్నారు. పది వారాలుగా కూలీ డబ్బులు బకాయిలు ఉన్నాయన్నారు. ప్రతి కూలీకి 200 రోజుల పనిదినాలు కల్పించాలని, కొలతలు లేకుండా రోజుకు రూ.600 చెల్లించాలన్నారు. రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడుశ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు, అంజయ్య, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కాటమయ్య కల్యాణం



పూజలో అందెల శ్రీరాములు, ఆలయ కమిటీ సభ్యులు

పహాడీషరీఫ్: గౌడ కులస్తుల ఆరాధ్య దైవం కాటమయ్య నామస్మరణతో జల్‌పల్లి గ్రామం బుధవారం మారుమోగింది. ఉదయం 4 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీ కాటమయ్య స్వామి, శ్రీ సురమాంభ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చిర్జి అందెల శ్రీరాములు యాదవ్, నిర్వాహకులు నర్సింగ్‌గౌడ్, రాజేష్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జూనియర్ కార్యదర్శుల సమ్మె



జెడ్పీటీసీకి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కందుకూరు: ప్రభుత్వం తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం ఆరో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా కందుకూరు డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన వారంతా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. వీరికి జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి మద్దతు తెలపగా , ఆయనకి వారు వినతి పత్రం అందజేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం కందుకూరు డివిజన్ అధ్యక్షుడు ఎండీ జావిద్, కందుకూరు మండల అధ్యక్షుడు మురళీమోహన్, ఆయా మండలాల అధ్యక్షుడు రాము, శివకుమార్, వాజిద్, రమేష్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో అన్నదానం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల కేంద్రంలోని శ్రీ బంగారు మైసమ్మ కాశీ వైద్య నాదేశ్వరా దేవాలయంలో నిత్యాన్నదానం మొదలుపెట్టి నేటికీ సంవత్సరం అవుతున్న సందర్భంగా బుధవారం దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. టి.వెంకటేశ్వర్లు, లత, నోముల కబీరదాస్, రేణుక, మెడికల్ ఆఫీసర్ డా.అర్చన సహాయంతో 1000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించామని ఆలయ ఫౌండర్ ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్ తెలిపారు.

ఉచిత వాటర్ ప్లాంట్లు అభినందనీయం

ఆమనగల్లు: ప్రజలకు సురక్షిత తాగునీటినే తాగాలని తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో రాష్ట్ర రజక యువజన సంఘం ఉపాధ్యక్షుడు నాగిళ్ల జగన్ ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి శుద్ధి కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో జగన్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్, స్థానిక నాయకులు కిశోర్, కుమార్‌గౌడ్, అబ్దుల్ రజాక్, మజీద్, నిరంజన్, వెంకటయ్య, మల్లయ్య, పురుషోత్తం, మహేశ్, శేఖర్, వినోద్, అంజద్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

తలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నిర్మల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీలో భాగంగా ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీతో పాటు, పీడీ ప్రభాకర్, అడిషనల్ డీఆర్‌డీఓ నీరజ, ఎస్ఆర్‌పీ భద్రునాయక్ హాజరయ్యారు. శాట్ (ఎస్ఎస్ఏఏటీ)ఆధ్వర్యంలో మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులపై డీఆర్పీలు సర్వే నిర్వహించారు. ఖర్చుపెట్టిన నిధులు–చేపట్టిన పనులపై ఆరా తీశారు. ప్రజలను అడిగి వాస్తవ విషయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీ గౌతమ్ చరణ్, ఎంపీడీఓ శ్రీకాంత్, విజిలెన్స్ ఆఫీసర్ కొండయ్య, ఏపీఓ కృష్ణ, ఈసీ కృష్ణ, టీఏ, ఎస్ఎ, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

ఆమనగల్లు: విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సూచించారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరంలో శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, శృతిలయ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు చిత్తరంజన్‌దాస్, సభ్యులు ధనలక్ష్మి, వెంకటేశ్, రజిత, సునీత పాల్గొన్నారు.